

శ్రావణం.. శుభప్రదం
నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, పొలాల అమావాస్య తదితర పండుగలు ఈ నెలలోనే వస్తాయి. 8లో▸



ప్రకృతి ఒడిలో పరమశివుడు
కదిలి మాతాన్నపూర్ణేశ్వరీ పాపహరేశ్వరాలయంలో నేటి నుంచి శ్రావణమాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఇతర రాష్ట్రాల భక్తులు కూడా దర్శించుకోనున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /25.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వాన కురిసే అవకాశముంది.

కొత్త చెరువుపై పట్టింపేది?

- కట్ట తెగి ఏడాదైనా మరమ్మతులేవి?
- బాధిత రైతును ఆదుకోని సర్కార్
- కోతకు గురైన పంటపొలాల దారి
- కాలినడకకూ నోచుకోని రైతాంగం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



కోతకు గురైన పొలాలకు వెళ్లే మట్టిరోడ్డు



ఇలేగాం చెరువుకు నీరు వెళ్లేందుకు నిర్మించిన అక్విడెక్ట్ ఇలా..

భైంసా/భైంసారూరల్: గతేడాది జూలై 28న కురిసిన భారీ వర్షానికి మండలంలోని ఇలేగాం సమీపంలో గుట్టకు ఆనుకుని నిర్మించిన కొత్త చెరువు తెగింది. తూము నుంచి వచ్చిన వరదంతా ఇలేగాం గ్రామానికి చెందిన మహిళా రైతు బట్టు రుక్మాబాయికి చెందిన 2.18 ఎకరాల పంటపొలాన్ని పూర్తిగా కనుమరుగుచేసింది. బండరాళ్లు, ఇసుకమేటలతో పంట భూమి మట్టి దిబ్బగా మార్చింది. గత ప్రభుత్వంలో ఐడీసీ చైర్మన్‌గా పనిచేసిన సముద్రాల వేణుగోపాలాచారి తెగిన చెరువును పరిశీలించారు. ఆ సమయంలో వేణుగోపాలాచారి కాళ్లపై పడ్డ రుక్మాబాయి కన్నీరు మున్నీరుగా విలపించి ఆదుకోవాలని వేడుకుంది. కానీ.. వ్యవసాయాన్నే నమ్ముకున్న ఈమె కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకురాలేదు. ఏ సహాయమూ అందించలేదు. ఈ కుటుంబం కష్టాలు చూసి గ్రామ యువకులే చందాలు వేసి ఆర్థికంగా కొంత సాయపడ్డారు. ఈ ఏడాది కూడా తాజాగా కురిసిన వర్షాలతో తెగిన ప్రధాన తూము నుంచి వచ్చే వరదంతా మళ్లీ ఈమె భూమిలోంచే ప్రవహిస్తోంది. మున్ముందు భారీ వర్షాలు కురిస్తే ఈ భూమి మొత్తం కనుమరుగు కానుంది.

మూసుకుపోయిన రహదారి

ఇలేగాం–సిరాల గ్రామాల మధ్య నిర్మించిన ఈ చెరువు ప్రధాన తూము వద్ద కట్ట తెగడంతో కాలువ పూర్తిగా మట్టిలో కూరుకుపోయింది. కాలువకు ఆనుకుని సిరాల గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు ఉండేది. ఈ రోడ్డును బాగుచేసుకుని ఇరుగ్రామాల రైతులు రాకపోకలు కొనసాగించేవారు. అత్యధికంగా వ్యవసాయ భూములు ఈ మట్టి రోడ్డుకు ఆనుకుని ఉన్నాయి. కిలోమీటరు మేర రోడ్డు కూడా గతేడాది కురిసిన వర్షానికి కోతకు గురైంది. ఈ ఏడాది ఈ మట్టి రోడ్డు పక్కనున్న 200 ఎకరాల సాగుభూములకు వెళ్లేందుకు రైతులకు తిప్పలు తప్పడంలేదు. రోడ్డుపై నల్లమట్టి చేరడంతో కాలుజారి పడుతున్నారు. ఎడ్లబండ్లు వెళ్లేలా రోడ్డును సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల పట్టింపు కరువు

చెరువు మరమ్మతు గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేస్తామని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారు. అక్విడెక్ట్ నుంచి కిలోమీటరు మేర మట్టితో మూసుకుపోయిన సీసీ కెనాల్‌లో జేసీబీతో మట్టిని తోడి రోడ్డుపై వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇలా చేస్తే తెగిపోయిన రోడ్డు మళ్లీ బాగవుతుందని పేర్కొంటున్నారు. మరోవైపు కాలువలో మట్టి తీస్తే ప్రధాన తూము నుంచి వర్షం కురిసినప్పుడల్లా పంటపొలాల్లోకి వెళ్లే నీరు సీసీ కెనాల్ ద్వారా నూతనంగా నిర్మించిన అక్విడెక్ట్ మీదుగా ఇలేగాం గ్రామ సమీపంలోని పాతచెరువులోకి చేరుతుందని తెలిపారు. 40 గంటలపాటు జేసీబీతో పనులు చేయిస్తే కాస్త ఉపశమనం దొరుకుతుందని రైతులు భావిస్తున్నారు. ఈ పనులు తాత్కాలికంగా చేపడితే అటు చేలకు వెళ్లే దారితోపాటు చెరువులో నీళ్లు చేరే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

ఎమ్మెల్యే సమీక్షించినా..

తెగిన కొత్త చెరువుతోపాటు ఇలేగాం వద్ద దెబ్బతిన్న సాగుభూముల అంశంపై ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అధికారులతో సమీక్షించారు. ఇటీవలే రైతులు ఎమ్మెల్యేను కలిసి పరిస్థితి వివరించారు. రైతుల సమక్షంలోనే ఇరిగేషన్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికి వెళ్లి పరిస్థితి చూడాలని ఆదేశించారు. అధికారులు ఇలేగాం కొత్త చెరువు వద్దకు వచ్చి తెగిన ప్రాంతం నుంచి కాలువ తీస్తే 200గంటల పనులు చేయాల్సి ఉంటుందని దాటవేశారు. సీసీ కెనాల్ ప్రాంతంలో మట్టితీసి 40 గంటల్లో పూర్తయ్యే పనులకు చెరువు లోపలినుంచి పనులు చేయాల్సి ఉంటుందంటూ చెబుతూ కాలం వెల్లదీస్తున్నారు. రోజూ కర్షకులు పడుతున్న ఇబ్బందులను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు. తెగిన చెరువు, దెబ్బతిన్న భూములు సిరాల ప్రాజెక్ట్ నిర్మాణంపై ఇదివరకే ఎమ్మెల్యే రామారావుపటేల్ అసెంబ్లీలో పలుసార్లు ప్రస్తావించారు. ఎమ్మెల్యే ఆదేశించినా ఇరిగేషన్ అధికారులు ఎందుకు తప్పించుకుంటున్నారో తెలియడంలేదని బాధిత రైతులు వాపోతున్నారు.

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



సిరాల గ్రామం వైపు ఉన్న పంటపొలాలకు వెళ్లలేకపోతున్నాం. రోడ్డు కొట్టుకుపోయింది. సీసీ కెనాల్‌లో ఉన్న మట్టితీసి రోడ్డు బాగుచేయాలి. గతేడాది పంటలు నష్టపోయాం. మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ సంవత్సరం కూడా తిప్పలు పడుతున్నాం. కొత్తచెరువు తెగి ఏడాదైనా మరమ్మతు చేపట్టడంలేదు. గతేడాదిలాగే ఇప్పుడూ పట్టించుకోవడంలేదు.

– ఈరన్న, రైతు

నీళ్లన్నీ పంటపొలాల్లోకి..



వర్షం కురిస్తే తెగిపోయిన కొత్త చెరువు నుంచి వచ్చే నీళ్లన్నీ పంటపొలాల్లోనే ఉంటున్నాయి. గతేడాది పంటలు కొట్టుకుపోయాయి. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు వాగులుగా మారే ప్రమాదముంది. పంటభూములు కోతకు గురికాకముందే పనులు చేపట్టాలి. సిరాల–ఇలేగాం గ్రామాల మధ్య ఉన్న రోడ్డును బాగుచేయాలి. కొత్తచెరువు కట్ట నిర్మించాలి.

– బక్కన్న, రైతు

ఉన్నతాధికారులతో చర్చిస్తాం

తెగిపోయిన కట్ట నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో ఏ పనులూ చేపట్టలేం. తాత్కాలిక పనులు చేపట్టే విషయంలో ఉన్నతాధికారులతో చర్చిస్తాం. గతేడాది చెరువు తెగడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం చూస్తున్నాం. చెరువు మరమ్మతులు చేపడితే సమస్యలు తీరుతాయి. తాత్కాలిక పనుల విషయంలో ఆలోచించాల్సి ఉంది.

– అనిల్, ఇరిగేషన్ డీఈ

న్యూస్‌రీల్

మధ్యప్రదేశ్ సీఎంను కలిసిన మోకుదెబ్బ నేతలు



సీఎంను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

నిర్మల్: గౌడ కులస్తులు అన్ని రంగాల్లో ఎదగాలని, బీసీ వర్గాలతో కలిసి రాజ్యాధికారం కోసం ముందుకు సాగాలని మధ్యప్రదేశ్ సీఎం డాక్టర్ మోహన్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈమేరకు బోపాల్‌లో ఈనెల 3, 4తేదీల్లో నిర్వహించిన గౌడ జాతీయ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఇందులో జిల్లా నుంచి వెళ్లిన గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ జాతీయ కమిటీ నాయకులు సీఎంను ప్రత్యేకంగా సన్మానించారు. బోపాల్ నగర మేయర్ మాలతిని కలిశారు. సీఎం మోహన్‌యాదవ్‌ను కలిసినవారిలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగులసిద్ధి రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజ్‌గౌడ్, కోశాధికారి అగబాలేశం గౌడ్, అధికార ప్రతినిధి బాలసాని సురేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులుగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థినులు

ఖానాపూర్: నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఆదివారం నిర్వహించిన 38వ జాతీయస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మస్కాపూర్ కేజీబీవీకి చెందిన కీర్తన, మల్లీశ్వరి, శాంతిప్రియ బంగారు పతకాలు అందుకున్నట్లు కరాటే మాస్టర్ ఆరీఫ్ తెలిపారు. అనంతరం విద్యార్థులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు అభినందించారు.

కడెం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 3,832 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అధికారులు ఒక వరద గేటు ద్వారా 4,677 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 696.300 అడుగులుంది.

7నుంచి నీటి విడుదల

లక్ష్మణచాంద: వానాకాలం సాగుకు ఈ నెల 7వ తేదీ నుంచి సరస్వతి, లక్ష్మి కాలువలకు నీరు విడుదల చేయనున్నట్లు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాసరావు గుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయకట్టు రైతులు గమనించాలని సూచించారు.



అప్పుడు గలగల.. ఇప్పుడు వెలవెల

గతేడాది జూలై చివరలో కురిసిన భారీ వర్షాలకు లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ఊర చెరువు నిండుకుండలా మారి అలుగు దుంకింది. ఈసారి సరైన వర్షాలు లేక వెలవెలబోతోంది. – లక్ష్మణచాంద



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని రిలే నిరాహార దీక్ష



దీక్ష శిబిరంలో కూర్చున్న గ్రామస్తులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య చేపట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని దిలావర్‌పూర్ రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలోని పలు కుల సంఘాల నాయకులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చని పంట పొలాల మధ్య ఫ్యాక్టరీని నిర్మించి తమను కాలుష్య కోరల్లోకి నెట్టుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ గోడు వినిపించుకుని న్యాయం చేయాలని కోరారు. దీక్ష శిబిరంలో దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు, మహిళలు, గుండంపల్లి గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: ఆదివారం సెలవుదినం, స్నేహితుల దినోత్సవం కావడంతో కడెం ప్రాజెక్ట్ పర్యాటకులతో సందడిగా మారింది. ప్రాజెక్ట్ అందాలను తిలకించి, కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. రోజంతా సందడి చేశారు.

గల్ఫ్ ప్రవాసులకు ప్రజావాణి

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లోని 'ప్రజాభవన్'లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న 'ప్రజావాణి'ని గల్ఫ్ ప్రవాసులు వినియోగించుకోవాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వదేశ్ పరికిపండ్ల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ బాధితులు, రిటనీలు, బాధిత కుటుంబీకులు సరైన ఆధారాలతో వినతిపత్రాలు అందించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

యూనిఫాం వస్త్రం చేరింది

- విద్యార్థులకు త్వరలో రెండో జత

మామడ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూళ్ల ప్రారంభంలోనే సర్కార్ మొదటివిడతగా ఒక జత యూనిఫాం అందించింది. రెండో విడతలో అందించేందుకు చర్యలు చేపట్టింది. టెస్కో ద్వారా విద్యాశాఖ యూనిఫాం వస్త్రాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకున్న 299 బేళ్ల వస్త్రాన్ని జిల్లా కేంద్రంలోని గోదాంలో నిల్వ చేశారు. అన్ని మండల కేంద్రాలకు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండల కేంద్రాలకు చేరుకున్న అనంతరం పాఠశాలలకు అందిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో యూనిఫాంలు కుట్టించి విద్యార్థులకు అందజేస్తారు. మొదటి విడతలో ఈ ఏడాది మే లో స్థానికంగా ఉండే దర్జీల ద్వారా, స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టించి జిల్లాలోని 52,264 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల ఆరంభంలోనే అందించారు.

ప్రతీ విద్యార్థికి అందేలా..

ప్రతీ విద్యార్థికి యూనిఫామ్ అందించేలా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో జత యూనిఫామ్ కుట్టించేందుకు ప్రభుత్వం రూ.75 చార్జి ఇస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు వస్త్రాన్ని అందించి కుట్టించే బాధ్యత ఏఏపీ కమిటీలకు అప్పగించారు. జిల్లాలో మొత్తం 755 పాఠశాలల్లో చదువుతున్న 52,264 మంది విద్యార్థులకు రెండో విడతలో ఒక జత యూనిఫాం అందించనున్నారు. ఇందులో 13 పాఠశాలలకు పీఎంశ్రీ పథకం ద్వారా 4,579 మంది విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించేందుకు రూ.2,28,950 అందించనున్నారు. 742 పాఠశాలలకు సమగ్రశిక్షా అభియాన్ ద్వారా 47,685 మంది విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించేందుకు చార్జీల కింద రూ.23,84,250 మంజూరయ్యాయి.



వాహనం నుంచి దించుతున్న యూనిఫాం వస్త్రం

రెండోవిడత అందిస్తాం



పాఠశాల విద్యార్థులకు రెండో విడతలో యూనిఫామ్‌లు అందించేందుకు గాను జిల్లా కేంద్రానికి వస్త్రం చేరింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా యూనిఫాంలు కుట్టించి విద్యార్థులకు త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

కష్టపడ్డారు.. కొలువు కొట్టారు

- ఏఈఈలుగా ఎంపికైన జిల్లాకు చెందిన పలువురు యువకులు
- రెండు ఉద్యోగాలకు ఎంపికైన ఈద్‌గాంవాసి

నిర్మల్‌ఖిల్లా: టీజీపీఎస్సీ వెలువరించిన ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు యువకులు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ కాలనీకి చెందిన వట్టిమల్ల శ్యామల–ప్రభాకర్ దంపతుల చిన్న కుమారుడు విశాల్ పదో తరగతి వరకు జిల్లా కేంద్రంలో చదివాడు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో, జేఎన్టీయూ హైదరాబాద్ యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్ అభ్యసించాడు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమై ఏఈఈ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గ్రూప్ వన్ సాధించడమే లక్ష్యంగా ప్రిపరేషన్ కొనసాగిస్తున్నట్లు విశాల్ ఈ సందర్భంగా తెలిపాడు. విశాల్ తండ్రి ప్రభాకర్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. సోదరుడు ప్రశాంత్ సీఏ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రభుత్వశాఖలో ఉన్నతోద్యోగం సాధించడంతో విశాల్‌ను పలువురు అభినందించారు.



తండ్రి ప్రభాకర్‌తో వట్టిమల్ల విశాల్ (ఫైల్)

రెండు ఉద్యోగాలకు ఎంపికైన అరుణ్



మీర అరుణ్

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని ఈద్‌గాంకు చెందిన మీర అరుణ్ తండ్రి చంద్రసేన్ మరణించగా తల్లి రాజమణి ప్రోత్సాహంతో కష్టపడి చదివాడు. పట్టుదలతో చదివి అరుణ్ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. అరుణ్ పదో తరగతి వరకు కొండాపూర్‌లోని సెయింట్ థోమస్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ శ్రీచైతన్యలో పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్, గోకరాజు గంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ చదివాడు. ఉద్యోగం కోసం సన్నద్ధమవుతూ ఇటీవల సెంట్రల్ రైల్వేలో జూనియర్ ఇంజినీర్‌గా ఎంపికై సికింద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండురోజుల క్రితం వెలువడిన ఫలితాల్లో మిషన్ భగీరథలో ఏఈఈగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, కాలనీవాసులు అరుణ్‌ను అభినందించారు.

పీఆర్ ఏఈఈగా ఎలగడప వాసి



దుర్గం రాజశేఖర్

కడెం: మండలంలోని ఎలగడప గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మి–నర్సయ్య దంపతుల కుమారుడు రాజశేఖర్ పీఆర్ ఏఈఈగా ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజశేఖర్ మండలంలోని లింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఎస్సెస్సీలో ఉత్తమ మార్కులు సాధించడంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఫ్రీ సీటు సంపాదించి ఇంటర్ చదివాడు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్ చదివాడు. సొంతంగా ప్రిపేరయ్యాడు. గ్రూప్–4, టౌన్ ప్లానింగ్ అధికారి, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి 1:1 అర్హత సాధించాడు. ఈ ఉద్యోగాల తుది ఫలితాలు వెలువడాల్సి ఉంది. కాగా, ఏఈఈగా ఎంపికైన రాజశేఖర్‌ను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

సత్తా చాటిన గ్రామీణ యువకులు

నర్సాపూర్ (జి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన టీజీపీఎస్సీ ఫలితాల్లో గ్రామీణ యువకులు సత్తా చాటి ఏఈఈ ఉద్యోగాలు సాధించారు. నర్సాపూర్(జి) మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన జీ దత్తురాం, బామ్ని (బి) గ్రామానికి చెందిన జీ అవినాష్ సివిల్ ఏఈఈలుగా ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు. చిన్న వయస్సులో గెజిటెడ్ ఉద్యోగాలు సాధించగా వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వీరిని గ్రామస్తులు, మండలవాసులు అభినందించారు.




దత్తురాం



అవినాష్

జిల్లా కేంద్రంలో తెరిపినివ్వని వర్షం



జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలో ఆదివారం ముసురు వాన రోజంతా కురిసింది. రోజు కూలీలు, ఉపాధి కోసం బయటకు వెళ్లేవారు ఇంటికే పరిమితమయ్యారు. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి. ఉదయం నుంచి ఏకధాటిగా ముసురు పడగా సాయంత్రం 6 గంటల తర్వాత భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని చెరువుల్లోకి వరదనీరు చేరింది.

కుంటాల మండలంలో..

కుంటాల: మండలంలోని కల్లూరు, అందాకూర్, ఓలా, కుంటాల, విఠాపూర్, అంబకంటి, లింబా (కే), లింబా(బి), సూర్యాపూర్ గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. పత్తి, సోయా పంటల్లో నీరు నిలిచింది. నీరు నిలువడంతో చేలల్లో కలుపు పెరుగుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కుంటాల: మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

రహదారిపై విరిగిపడ్డ వృక్షం



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

కడెం: మండలంలోని దోస్తినగర్ సమీపంలో ఉట్నూర్ చౌరస్తా వద్ద నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై గాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. రోడ్డుపై అడ్డంగా చెట్టు పడడంతో రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. జన్నారం వైపు నుంచి కడెం, ఖానాపూర్, నిర్మల్ వచ్చే వాహనదారులు కలమడుగు, దస్తురాబాద్ మీదుగా కడెం చేరుకున్నారు. పోలీసులు స్థానికుల సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల వాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పక్కా సమాచారంతో కిష్టంపేటలో శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ని పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యజమాని అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నాడని, గతంలో ఈ ట్రాక్టర్‌ను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారని వివరించారు.

వాంకిడిలో..


పట్టుబడిన వాహనంతో పోలీసులు

వాంకిడి: మండలంలోని కనర్‌గాం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజాప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జివితి గ్రామానికి చెందిన కపుల్ శ్యాంరావు డీసీఎం వాహనంలో ఇసుకను తరలిస్తున్నాడు. ఖమాన ఎక్స్‌రోడ్ సమీపంలో టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం తనిఖీ చేశారు. వాహనం పట్టుకుని, శ్యాంరావుపై కేసు నమోదు చేసి వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై గంగన్న, పోలీస్ కానిస్టేబుల్ సంజీవ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కెరమెరి: మండలంలోని సాంగ్వి వాగు వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కెలిబి గ్రామానికి చెందిన లోబడే నారాయణ బైక్‌పై కెరమెరికి వస్తున్నాడు. ఇందాపూర్‌కు చెందిన వాడై కుమార్ కెరమెరి నుంచి ఇందాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కెరమెరి పీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి


సలీం (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత సలీం విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. మండలంలోని హర్కాపూర్ గ్రామంలో తనకున్న సర్వీసింగ్ పాయింట్ వద్ద పనులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుమారుడు సోషియాన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ప్రతిరోజూ ప్రత్యేకతే
- నెలరోజులూ పూజలు, వ్రతాలు


వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్/నేరడిగొండ: శ్రావణం..శుభప్రదం.. ఈ మాసం ఎంతో ప్రాముఖ్యత ఉంది. పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలోకి సంచరించటం వల్ల శ్రావణమాసం పేరు వచ్చిందని వేదపండితులు చెబుతున్నారు. ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకువస్తుంది. ఇక నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, పొలాల అమావాస్య తదితర పండుగలు ఈ మాసంలో రావడం దీని ప్రత్యేకత. ఈనెలలో మహిళలు పూజలతో ఆలయాలు కిటకిటలాడనున్నాయి.

మార్కెట్‌లో సందడి..

ఈ మాసంలో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. నూతనవస్త్రాలు, ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. పట్టణంలోని పలు వస్త్ర దుకాణాల్లో ప్రత్యేక ఆపర్లు ప్రకటించి వినియోగదారులను అకట్టుకుంటున్నాయి. పూలు, పండ్ల వ్యాపారులకు డిమాండ్ పెరగనుంది.

సోమవారం: ముక్కంటి ఈశ్వరునికి సోమవారం ఎంతో ప్రీతికరమైన రోజు. శివుడికి అభిషేకం చేసి పూజలు నిర్వహిస్తే స్వామి కటాక్షాన్ని పొందవచ్చు. అర్చనలు చేసి నమస్కరిస్తే సకల పాపాలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

మంగళవారం: అభయమిచ్చే ఆంజనేయుడు..సకల విఘ్నాలు తొలగించి ముందుగా పూజలందుకునే విఘ్నేశ్వరుడు. సంతాన భాగ్యాన్ని కలిగించే సుబ్రహ్మణ్యేశ్వరుడు మంగళవారమే జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. మంగళగౌరికి ప్రీతికరమైన రోజు. ఆయా దేవతలందరినీ భక్తిశ్రద్ధలతో పూజిస్తే శుభాలు కలుగుతాయని నమ్మకం.

బుధ,గురువారాలు: శ్రావణమాసంలో బుధవారం అయ్యప్ప స్వామికి, గురువారం రాఘవేంద్ర స్వామి, దక్షణమూర్తి, సాయిబాబాలకు ప్రీతికరమైన రోజులు. ఆయా దేవతలను, గురువులను దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం.

శుక్రవారం: శ్రావణమాసంలో వచ్చే ప్రతి శుక్రవారం ఎంతో ప్రాధాన్యం. వరలక్ష్మి వ్రతం ఆచరించే వారికి శుభప్రదమైన వారం. అమ్మవారికి కుంకుమార్చనలు, ఎర్రని పూలు, అల్లిన మల్లెల మాలను సమర్పిస్తే పాపాలు తొలగి రుణవిముక్తి, లక్ష్మీ కటాక్షం, సౌభాగ్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

శనివారం: కలియుగదైవం శ్రీనివాసుడికి ఎంతో ప్రీతికరమైన రోజు శనివారం. ఉపవాస దీక్షలు చేపడతారు. స్వామివారికి పుష్పార్చనలు, తులసీదళల మాలలు సమర్పిస్తారు. ప్రతి శనివారం ఇలా చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

ముహూర్తాలు ఇలా..

మూఢంతో మూడు నెలలు శుభకార్యాలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసం కొనసాగనుంది. ఈనెల 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మహిళలు ఇంటిటా ప్రత్యేక పూజలతోపాటు ఉపవాస దీక్షలు చేస్తారు. రెండో శుక్రవారం 16న వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. అలా కుదరని వారు నాలుగవ శుక్రవారం 30న ఆచరిస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో శ్రీలక్ష్మీదేవికి, ఆలయాల్లో పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలుంటాయి.

సకల శుభాలు ఈమాసంలో..



శ్రావణమాసంలో భక్తితో భగవంతుడిని ఆరాధిస్తే సకల శుభాలు వరిస్తాయి. పండుగలు, పర్వదినాలకు నోములు, వ్రతాలకు అనువైన మాసం. సిరిసంపదలు ప్రసాదించమంటూ మహాలక్ష్మీని కొలిచే శ్రావణంలో శివశక్తిని పూజిస్తారు. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం శ్రావణం.

– శంశాక్, అర్చకుడు, మంచిర్యాల

శ్రావణం..భక్తి మాసం



శ్రవణ నక్షత్రమే వేంకటేశ్వరస్వామి అవతార నక్షత్రం. ఈ మాసాన్ని మహిళలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. మంగళగౌరి వ్రతం, వరలక్ష్మీ వ్రతాలతో అమ్మవారిని కొలుస్తారు. దీక్షలు చేస్తారు. రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ఈనెలలోనే వస్తాయి. అందుకే శ్రావణ మాసాన్ని భక్తిమాసంగా భావిస్తారు.

– ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి, పురోహితుడు, వడూర్

10న సత్యనారాయణ వ్రతం

బాసర: బాసరలోని శ్రీ పాపాహరేశ్వర ఆలయంలో ఈనెల 10న సామూహిక సత్యనారాయణ వ్రత పూజ నిర్వహించనున్నట్లు శ్రీ త్రిపుర వత్సలా రామసేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 37 మంది దంపతులు పాల్గొంటారని వివరించారు. (పూజకి కూర్చునే దంపతులు) పురుషులు కండువా తిలకధారణ/మహిళలు చీర గాజులు, మంగళహారతి, కలశం, పువ్వులు, పండ్లు తీసుకురావాలని పేర్కొన్నారు. వ్రత పూజలో పాల్గొనేవారు ఈనెల 8లోపు ఆలయంలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జన్నారం: నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ కాలెండర్ విడుదల చేసిందని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు రాజన్న, ఫసీఉల్లా, నందునాయక్, సతీశ్, కరుణాకర్, అజార్, మౌళానా, పాల్గొన్నారు.

తమ్ముడు మాట వినడం లేదని అన్న ఆత్మహత్య

- ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో ఘటన
- కేసు నమోదు


శివ (ఫైల్)

ఖానాపూర్: మద్యానికి బానిసై తమ్ముడు ఏ పనిచేయడం లేదని, తన మాట వినడం లేదని మనస్తాపంతో అన్న బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని మస్కాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన లోనికి సత్తవ్వ, పెంటయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు శివకుమార్ (33) మలేషియా వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో కుటుంబీకులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కాగా, తమ్ముడు రాకేశ్ ఇంటి వద్దే ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. పలుమార్లు అతన్ని హెచ్చరించినా మార్పు రాలేదు. దీంతో శివకుమార్ మనస్తాపం చెంది శనివారం రాత్రి మస్కాపూర్ శివారులోని ఓ వేప చెట్టుకు తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో రెండు మృతదేహాలు

- బాసర వద్ద కలకలం



గుర్తుతెలియని వృద్ధుడు, యువకుడి మృతదేహాలు

బాసర: బాసర వద్ద గోదావరి నదిలో ఆదివారం రెండు మృతదేహాలు కలకలం రేపాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. ఒకటి వృద్ధుడి మృతదేహంగా గుర్తించారు. వయసు 60 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మరో మృతదేహం యువకుడిదని, వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని వెల్లడించారు. మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారం వ్యవధిలో నలుగురి మృతదేహాలు లభ్యం కావడం చర్చనీయంగా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి వరద వస్తుండడంతో మృతదేహాలు కొట్టుకొస్తున్నట్లు భావిస్తున్నారు.

ఐదు కిలోల గంజాయి పట్టివేత


నిందితుడితో పోలీసులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఈశ్వర్‌నగర్ సమీపంలోని నర్సాపూర్ చౌక్ వద్ద బైక్‌పై ఐదు కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నార్నూర్ మండలం బోర్‌గాం గ్రామానికి చెందిన సాబ్లే బాక్సండ్‌సింగ్ 5 కిలోల గంజాయిని విక్రయించడానికి బైక్‌పై ఆదిలాబాద్ వెళ్తున్నాడు. పక్కా సమాచారంతో ఆదివారం తనిఖీ చేయగా గంజాయి లభించింది. స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్సై సునీల్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన సాహెర్‌ని పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహా రాష్ట్రలోని కిన్వట్ నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ చిన్న,చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నాడు. ఆదివారం తాటిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో విక్రయిస్తుండగా పట్టుకుని 80 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2వేలు ఉంటుందని తెలిపారు. ఒక్కో ప్యాకెట్ ను రూ.100కు విక్రయిస్తున్నాడని, 13 వరకు ప్యాకెట్లు ఆయన వద్ద లభ్యమైనట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారంతో పట్టుకున్నామని ఎస్సై వివరించారు.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తాం


ధర్నా చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు


మాట్లాడుతున్న పసుల రామ్మూర్తి

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు పునరాలోచించాలన్నారు. ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించే 'హలో మాల చలో ఢిల్లీ'కార్యక్రమానికి వేలాదిగా మాలలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా

తలమడుగు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఎస్సీలు ఐక్యంగా ఉన్నప్పటికీ విడిగొట్టేందుకు వర్గీకరణ బిల్లు చేపట్టడం సరి కాదన్నారు. సుప్రీంకోర్టు ఆబిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవన్న, చంటి, గంగన్న, నారాయణ, వేణు, శ్రీనివాస్, అనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

దండేపల్లి: మాలల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని జైభీమ్ సైనిక్‌దళ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆసాది పురుషోత్తం అన్నారు. దండేపల్లిలో ఆదివారం మాలమహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం దండేపల్లి మండల యువజన తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపల్లి జీవన్, ఉపాధ్యక్షుడిగా తీగల జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినయ్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కార్యదర్శిగా వెంకటేశ్, సలహాదారుగా సాగర్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


చౌదరి నవీన్ (ఫైల్)

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం.. కుంచవెల్లికి చెందిన చిప్ప సూరజ్‌కు ఎలక్ట్రికల్ షాపు ఉంది. చౌదరి నవీన్ (17)తో కలిసి సామగ్రి కొనుగోలు కోసం బైక్‌పై కాగజ్‌నగర్‌కు వెళ్లారు. తిరిగివస్తుండగా మండల కేంద్రం మల్లన్న ఒర్రె సమీపంలోని కల్వర్టు వద్ద ఆగి ఉన్న మరో బైక్‌ను అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రైతుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్సులో కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ చౌదరి నవీన్ మృతి చెందాడు. నవీన్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి చౌదరి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వైన్స్‌లో చోరీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రేణుక వైన్స్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షటర్ పగులగొట్టి చొరబడి కౌంటర్‌లో రూ.30 వేల నగదు, రూ.10 వేల విలువ గల మద్యాన్ని ఎత్తుకెళ్లారు. వైన్స్ ఎదుట సీసీ కెమెరాల్లో ముగ్గురు చోరీచేసినట్లు రికార్డు అయింది. వైన్స్ యజమాని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

వాహనం బోల్తా

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై వాహనం బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతానికి పార్సల్ సామాగ్రితో ఆదివారం వాహనం వెళ్తోంది. ఈ క్రమంలో అడవిపందులు అడ్డురావడంతో డ్రైవర్ వాహనం తప్పించే యత్నంలో అదుపుతప్పి బోల్తాపడింది. స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డారు.

కుక్కలదాడిలో చుక్కలదుప్పి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: కుక్కల దాడిలో ఆదివారం చుక్కల దుప్పి మృతి చెందింది. మండలంలోని కడంబా అటవీ ప్రాంతం నుంచి కుక్కలు దుప్పిని తరుముతూ భీమన్న ఆలయం వరకు వచ్చింది. ఆ సమయంలో కౌటాల మండలం బోదంపల్లికి చెందిన అనిల్ వాటిని తరిమివేశాడు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో దుప్పి మృతి చెందింది. ఎఫ్‌ఎస్‌ఓ సుభాన్‌గౌరీ, సిబ్బంది గణేశ్, మల్లేశ్, రాంచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ రమాదేవి తెలిపారు.

గ్రాట్యూటీ సర్వీస్ డబ్బులు చెల్లించాలి

జైపూర్: ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపట్టిన స్టీగ్ కంపెనీకి సబ్ వ్యవహరించిన కంపెనీలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు గ్రా ట్యూటీ సర్వీస్ డబ్బులు వెంటనే చెల్లించాలని హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ ప్రధాన కార్యదర్శి విక్రమ్ తెలి పారు. జైపూర్‌లో ఆదివారం నిర్వహించిన హెచ్‌ఎంఎస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా కార్మికులకు చెల్లించాలిన గ్రాట్యూటీ డబ్బులు చెల్లించకుండా సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రెండేళ్లుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు సంపత్, సాయికృష్ణ, నాయకులు శ్రీధర్, మరేశ్, అజేయ్, అంజి పాల్గొన్నారు.

మళ్లీ.. కాలేజీ రోజుల్లోకి


రజతోత్సవంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఆనాటి అధ్యాపకులు

నిర్మల్: వారంతా ఎప్పుడో పాతికేళ్ల క్రితం కలిసి ఇంటర్ చదువుకున్న మిత్రులు. ఆ తర్వాత ఉన్నతవిద్య, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, పిల్లలు.. ఇలా ఎవరితోవలో వారు సాగిపోయారు. సరిగ్గా 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. మళ్లీ..ఆనాటి తమ కాలేజీ రోజుల్లోకి వెళ్లారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీలో 1997–98లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకున్న బ్యాచ్ పూర్వవిద్యార్థులు సరిగ్గా స్నేహితుల దినోత్సవమైన ఆదివారం స్థానిక మారుతీఇన్‌లో రజతోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్కడెక్కడో ఉంటున్న పాతమిత్రులంతా తరలివచ్చారు. ఇన్నేళ్లపాటు కలుసుకోనివారైతే.. అప్యాయంగా మాట్లాడుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా కలిసి రోజంతా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి ప్రిన్సిపాల్ సాయన్నతో సహా గురువులను సన్మానించుకున్నారు. కార్యక్రమ సమన్వయకర్తలు మునిగెల సాయిప్రసాద్, అరుణ్, శ్రీహరి, సబిత, సంధ్య మిగతా మిత్రులు ఏర్పాట్లు చూసుకున్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు


శ్రీరాఘవేంద్ర హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీరాఘవేంద్ర హైస్కూల్‌లో 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అందరూ కలిసి ఒకరినొకరు ఆప్యాయతతో పలుకరించుకుని అలింగనం చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి బోజనం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం


సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

పాతమంచిర్యాల: నస్పూర్ మున్సిపాలిటీలోని సరస్వతి శిశుమందిర్‌లో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. హెచ్‌ఎం ధూళిపాల కాశీ విశ్వనాథం, పూదరి సత్యనారాయణ, ఆచార్యులు పాల్గొన్నారు.

బస్సుకు తప్పిన ప్రమాదం



తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) గ్రామానికి ప్రయాణికులతో బస్సు వెళ్తోంది. అర్లి(టి) సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద బస్సు వెనుక టైర్ నట్లు ఊడింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డుపై నిలిపివేశాడు. స్థానికుల సాయంతో టైర్ నట్లు బిగించి తీసుకెళ్లారు. అరగంట పాటు ట్రాఫిక్ ఏర్పడింది. ధనోర నుంచి కరంజి(టి) వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో టైర్ నట్లు ఊడినట్లు భావిస్తున్నారు.